
ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 ; కనిష్ఠం 24.5



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 27 మే 2025



వృద్ధురాలి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, మే26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 409 దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో భూముల సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు తదితర అంశాలపై దరఖాస్తులు అందాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన మొత్తం 86 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు సాధ్యాసాధ్యాలపై సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 409 దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపడుతూ దరఖాస్తుదారునికి రాతపూర్వకంగా సమాచారం అందించాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించిన దరఖాస్తులు ఆయా బ్యాంకుల నుంచి వెరిఫికేషన్ చేయించాలని, సంబంధిత ఎంపీడీఓలు మానిటరింగ్ చేయాలని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్క్‌అవుట్ త్వరగా ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణాలకు త్వరగా పూర్తిచేసే విధంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల మంజూరు చేపట్టాలని తెలిపారు. భూ గర్భజలాల పెంపునకు ప్రతీ గ్రామంలో ఇంకుడు గుంతలు, పామ్‌పాండ్స్‌లను ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ చందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..

తన భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మండల స్థాయి అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఎవరూ పట్టించుకోవడం లేదని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన రాజనర్సయ్య కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తూనే ఉన్నామని, దరఖాస్తుల స్వీకరిస్తున్నారే తప్ప తగిన న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. భూములను కబ్జాలు చేస్తున్న వారిపై, అందుకు సహకరిస్తున్న అధికారులపైనా, దొంగ సాక్షి సంతకాలు పెడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్



- ముందుగానే నైరుతి రుతుపవనాలు
- అకాల వర్షాలతో చల్లబడిన వాతావరణం
- ఇప్పటికే ప్రారంభమైన రోహిణి కార్తె
- రోహిణితో వ్యవసాయ పనులు షురూ
- చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ
- జూన్ మొదటివారంలో తొలకరి వర్షాలు
- సాగుకు సిద్ధమవుతున్న జిల్లా రైతులు

ఖరీఫ్‌కు సన్నద్ధం

కామారెడ్డి, మే 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత నాలుగైదు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. గత వారం కిందట ఎండలు మండిపోగా, అకాలవర్షాలతో వాతావరణం చల్లబడింది. దీంతో ఇప్పటికే రైతులు పొలం బాట పట్టారు. రోహిణి కార్తె సైతం ప్రారంభం కావడంతో పూర్తిస్థాయిలో వానకాలం సీజన్ మొదలైంది. ఈ క్రమంలోనే వాతావరణశాఖ రైతులకు చల్లని కబురు చెప్పింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నట్లు పేర్కొంది. దీంతో జూన్ మొదటివారంలో తొలకరి వర్షాలు పడనున్నాయి. ఇప్పటికే రైతులు పంటలసాగుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యవసాయశాఖ సైతం వానకాలం పంటలసాగు ప్రణాళికను రూపొందించింది. ఈ సీజన్‌లో 5.36 లక్షల ఎకరాలలో పంటలు సాగుకానున్నాయి.

సాగుకు రైతులు సన్నద్ధం

వానాకాలం సాగుకు రైతులు ఇప్పటికే సన్నద్ధమవుతున్నారు. వేసవి దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు రైతులు భూసారం పెంచేందుకు జీలుగ విత్తనాలను విత్తుతున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ 5.36 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది. అవసరమైన విత్తనాలను ఎరువులను సిద్ధంగా ఉంచి సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. జీలుగ, పచ్చిరొట్టె, జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

జిల్లాలో ముందస్తుగా వర్షాలు కురుస్తున్నందున రైతులు ముందస్తు పంటలసాగుకు సిద్ధం అవ్వాలని వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముందస్తుగా పంటలు సాగుచేస్తే వానాకాలం యాసంగి పంటల కోతల సమయంలో అకాలవర్షాల నుంచి తప్పించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, రుణాలు, పెట్టుబడి ప్రణాళిక చేసుకోవాలని చెబుతున్నారు. సేంద్రియ ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

ఆరుతడి పంటల సాగుపై దృష్టి

జిల్లాలో సాగునీటి సౌలభ్యం లేని ప్రాంతాలలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, సోయా, పత్తి, కందులు లాంటి ఆరుతడి పంటలకు సాగుపై రైతులు దృష్టిసారించారు. మెట్ట భూముల్లో ఆరుతడి పంటల సాగు కోసం రైతులు సిద్దమవుతున్నారు. జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, తాడ్వాయి, గాంధారి, రాజంపేట, సదాశివనగర్ మండలాల్లో ఆరుతడి పంటలకు సాగుకు భూములను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే గత వారం రోజులు నుంచి వర్షాలు కురుస్తుండడం జూన్ మొదటి వారంలో తొలకరి పలకరించడంతో రైతుల్లో పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారి వచ్చే ఏడాది మాదిరిగానే అధిక వర్షాలు ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుండడంతో రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

5.36 లక్షల ఎకరాలలో పంటల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో వానకాలం పంటలసాగుకు సంబంధించిన ప్రణాళికను వ్యవసాయశాఖ రూపొందించింది. గత సీజన్‌తో పోలిస్తే ఈ వానకాలంలో కాస్తా సాగు విస్తీర్ణం పెరగనుంది. గడిచిన వానకాలం సీజన్‌లో 5.16 లక్షల ఎకరాలలో వివిధ పంటలుసాగుకాగా ఈ సీజన్‌లో 5.36 లక్షల ఎకరాలలో పంటలుసాగవుతాయని అంచనా వేశారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో పంటసాగు విస్తీర్ణం కాస్త పెరగనుంది. దీంతో వరి 3,18,342 ఎకరాలలో సాగవుతుందని అంచనా వేయగా, 52,016 ఎకరాలలో మొక్కజొన్న, 34,459 ఎకరాలలో పత్తి, 84,220 ఎకరాలలో సోయాబిన్, 21,300 ఎకరాలలో కందులు, 4347 ఎకరాలలో పెసర్లు, 2993 ఎకరాలలో మినుములు, 4100 ఎకరాలలో చెరుకు, 300 ఎకరాలలో జొన్నలు పంటలు సాగవుతాయని అంచనా వేశారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ఈ వానాకాలం సీజన్‌లో సాగయ్యే పంటలకు అనుగుణంగా విత్తనాలను సైతం అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి ప్రణాళికను రూపొందించారు. 95,503 క్వింటాళ్లలో వరి, 25,266 క్వింటాళ్లలో సోయాబిన్, 345 పత్తిప్యాకెట్లు, మొక్కజొన్న 4161 క్వింటాళ్లలో, కందులు 852 క్వింటాళ్లలో, పెసర 348 క్వింటాళ్లలో, మినుములు 239 క్వింటాళ్లలో విత్తనాలు అవసరం కానున్నాయి. అయితే ఈ విత్తనాలకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడిని ఇవ్వడం లేదు. వీటితో పాటు సబ్సిడిపై 10,700 క్వింటాళ్లలో, జనుము, జీలుగ విత్తనాలను ప్రభుత్వం సరాఫరా చేయనుంది. జిల్లాలో ఇప్పటికే జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు. 1.46వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వీటిలో 68,654 మెట్రిక్ టన్నులలో యూరియా, 44,762 మెట్రిక్ టన్నులలో కాంప్లెక్స్, 18,222 మెట్రిక్ టన్నులలో డీఏపీ, 16,926 మెట్రిక్ టన్నులలో ఎంఓపీ ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటికే యూరియా 8122 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని కాంప్లెక్స్ 4969 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1767 మెట్రిక్ టన్నులలో, ఎస్ఓపీ 260 మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



కాళేశ్వరం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

పవిత్ర నదుల్లో స్నానం చేయడం అదృష్టం

- భారీ కాన్వాయ్‌తో సరస్వతీ పుష్కరాలకు వెళ్లిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి, మే 26 (ఆంధ్రజ్యోతి): పవిత్ర నదుల్లో స్నానం చేయడం అదృష్టమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కర మహోత్సవాలకు సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎనిమిది మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి 150 వాహనాలలో వెళ్లారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించి శ్రీముక్తేశ్వరస్వామి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల్లో పవిత్ర నదుల్లో స్నానం చేయడం అదృష్టమని అన్నారు. రైతులు పాడి పంటలలతో, ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎనిమిది మండలాల మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పాల్గొన్నారు.



కాళేశ్వరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్న ఎమ్మెల్యే

దుబాయ్‌లో రామారెడ్డి వాసి మృతి

రామారెడ్డి, మే26 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన రామారెడ్డి మండలం గోకుల్‌తండాకు చెందిన యువకుడు మృతిచెందినట్లు తండావాసులు తెలిపారు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామానికి చెందిన మాలోత్ భాస్కర్ నాయక్ (22) ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్‌లో 10 నెలలుగా పనిచేస్తున్న మాలోత్ భాస్కర్‌నాయక్ అనారోగ్యం పాలయ్యాడు. పరిస్థితి విషమించడంతో పని చేస్తుండగా మృతిచెందినట్లు అక్కడున్న మిత్రులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. మృతదేహం త్వరగా గ్రామానికి వచ్చేందుకు కృషిచేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు కోరినట్లు గ్రామస్థులు తెలిపారు.



మాలోత్ భాస్కర నాయక్

వానాకాలం సాగుకు రైతాంగం సమాయత్తం

- నిజాంసాగర్ ప్రాజెక్టు కింద 1,35 వేల ఎకరాల సాగుకు ప్రణాళిక
- ఈయేడు వానాకాలం సాగుకు నీటికి ధోకా లేనట్టే..

5

ప్రాచీన క్రీడకు గుర్తింపు

- కర్రసాము ద్వారా ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం
- బాలభవన్‌లో ప్రతియేటా కర్రసాము శిక్షణ

5

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- రోడ్లపైనే చెత్తాచెదారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

5



గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయాలు!



- గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- రాత్రింబవళ్లూ మద్యం అమ్మకాలు
- మద్యానికి బానిస అవుతున్న జిల్లా యువత
- బెల్ట్ షాపులు మూయించాలని కార్యదర్శులకు వినతిపత్రాలు
- బెల్టు షాపులపై చర్యలు చేపట్టని ఎక్సైజ్ శాఖాధికారులు

నాగిరెడ్డిపేట,మే26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో కొందరు బెల్టుషాపులను నిర్వహిస్తూ రాత్రింబవళ్లూ మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ నిఘా పెట్టకపోవడంతో మండలంలో మద్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా సాగుతోందని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గ్రామాల్లో రాత్రి బళ్ళు అక్రమ మద్యం అందుబాటులో ఉండటంతో గ్రామీణ యువత మద్యానికి బానిస అవుతున్నారు. గ్రామాల్లోని కిరాణా షాపుల యజమానులు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టషాపుల నిర్వాహకులు యథేచ్ఛగా తమ మద్యం దందాను సాగిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు మండల కేంద్రంలోని వైన్‌షాప్ నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తూ అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరు బెల్ట్ షాపుల నిర్వాహకులు ఎల్లారెడ్డి వైన్‌షాప్‌ల నుంచి మద్యాన్ని కొనుగోలుచేసి గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులకు వైన్ షాపుల యజమానులు పూర్తిగా ప్రోత్సహిస్తుండడంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని గ్రామీణ ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

రాత్రింబవళ్లూ విక్రయాలు

గ్రామాల్లో మద్యం విక్రయాలు రాత్రింబవళ్లూ సాగుతున్నాయని ప్రజలు చెప్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బెల్ట్‌షాపుల నిర్వాహకులు అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్నారు. బీరు, క్వాటర్, ఆఫ్ బాటిల్లపై 10 నుంచి 20 రూపాయల వరకు అధిక ధరలు తీసుకుంటూ బెల్టుషాపుల నిర్వాహకులు మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారని చెప్తున్నారు. ఎంత రాత్రి అయినా బెల్టుషాపుల నిర్వాహకుల ఇంటి తలుపు తడితే చాలు మద్యం లభిస్తుందని గ్రామీణులు అంటున్నారు.

బెల్టుషాప్‌లను తొలగించాలని వినతులు

గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను తొలగించాలని కోరుతూ ఇటీవలే మాల్తుమ్మెద, నాగిరెడ్డిపేట గ్రామాల్లోని పలువురు యువకులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు (తరువాయి 6వ పేజీలో..)



బెల్టుషాపులు మూయించాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న మాల్తుమ్మెద గ్రామస్తులు



మాల్తుమ్మెదలో దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి అశోక్

కార్యకర్తలు ప్రజలకు మధ్య వారధిగా ఉండాలి

● బాల్కొండ నియోజకవర్గ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ముప్కాల్, మే26(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజల సమస్యలను తీర్చాలని బాల్కొండ నియోజకవర్గ పర్యవేక్షుడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఉమ్మడి బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందే విధంగా సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. త్వరలో కొత్త రేషన్ కార్డులను మార్పులు చేర్పులు జరుగుతున్నాయని ఇప్పటికి కొన్ని రేషన్ కార్డులు వచ్చాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు త్వరగా ముగించి రైతుల ఖాతాలో డబ్బులు జమయ్యే విధంగా చూడాలన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియో జకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్‌కుమార్, మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌యాదవ్, బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, వేల్పూర్ మార్కెట్ డైరెక్టర్ చంద రవి, బద్దం సాగర్, చిన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ మే ధ్యే యంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు ప్రతీకార్యకర్త సైనికుడిలా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండల పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కార్పొరేషన్‌చైర్మన్ పార్టీజిల్లా అధ్యక్షుడుమానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతితో కలిసి పాల్గొన్న సునీల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ నిరంతరం సైనికుడిలా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఇందుకు కార్యకర్తలు ఏకాభిప్రాయంతో గ్రామ, మండల నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు లేని నిరుపేదకు సొం తింటి కల నెరవేర్చేందుకు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తున్నామని అర్హత ఉన్న ఏ ఒక్కరిని వదలకుండా సొంతింటి కలను ప్రజప్రభుత్వం నెరవేరుస్తుందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధ్య క్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం త్వరలోనే రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి తెలిపారు. ఈసమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, అనంత్‌రావు, కుంట రమేష్, మల్లెల లక్ష్మణ్, కన్నె సురేందర్, ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అనుబంధ సంఘాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని పదవులను గెలుచుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మోర్తాడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో కమ్మర్‌పల్లి,మోర్తాడ్, ఏర్గట్ల మండలాల కాంగ్రెస్‌పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తల్లిలాంటిదని పార్టీకోసం పనిచేసే కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని అంతవరకు కార్యకర్తలు ఓపిక పట్టాలని అన్నారు. రానున్న సంస్థాగత ఎన్నికల కొరకు గ్రామాలలో కార్యకర్తలు, నాయకులు బలోపేతం చేయాలని అన్నారు. పార్టీలోకి కొత్తగ వచ్చిన వారిని కూడా పార్టీ గుర్తిస్తుందని వారిని పార్టీ కార్యవర్గంలో తీసుకుంటామని అన్నారు. ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పార్టీ అధ్యక్షులను ఆయా గ్రామాల కార్యకర్తలు ఏకగ్రీవంగా ఒకరిని ఎన్నుకోవాలని, అలాకాకుంటే అధిష్టానమే ఎంపిక చేస్తుందని అన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తల వల్లనే నాయకులకు గౌరవమని కార్యకర్తలు లేకుంటే నాయకులు లేరని అన్నారు. కార్యకర్తలు నాయకులకే కాకుండా పార్టీకి పనిచేయాలని అన్నారు. నాయకుల మధ్య విబేదాలు పట్టించుకోవద్దని అన్నారు. సమావేశంలో మూడు మండలాల అధ్యక్షులు సుంకెట రవి, సోమదేవారెడ్డి, ముత్యాల రాములు, రొక్కం మురళి, శివనేల్ల శివకుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటు కాంగ్రెస్‌పార్టీని మరింత పటిష్టం చేయాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ సూచించారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గ పర్యవేక్షకులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజలమధ్య ఉంటు వారి సమస్యలను తీర్చాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారని వారి ఆశలను నెరవేర్చవల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. కార్యకర్తలందరు ఏకాభిప్రాయంతో మండల, గ్రామ నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సకల జనుల మేలుకొరకు సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. అర్హత ఉన్న వారందరికి తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. త్వరలోనే రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తడిసిన వరిధాన్యం ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. త్వరలోనే సన్న వడ్లకు బోనస్ కూడా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, నియోజవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మండల గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి'



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన 4 వేల పెన్షన్ అందించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12వేల రూపాయలు అందించాలని, తంబాకు కొనుగోలును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట రైతు సంఘం, కార్యకర్తలు తదితరులున్నారు.

పొతంగల్‌లో 30పడకల ఆసుపత్రి నిర్మించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి,మే26(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో 30పడకల ఆసుపత్రిని నిర్మించడంతో పాటు 24గంటల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు.ఈ మేరకు పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేవలం ఆరు పడకలు మాత్రమే ఉన్నాయన్నారు. పొతంగల్‌తో పాటు చుట్టు పక్కల 20గ్రామాలతో పాటు మహారాష్ట్ర గ్రామాలు సరిహద్దున ఉన్నాయన్నారు. వైద్యం కోసం అనునిత్యం ప్రజలు పొతంగల్ మండల కేంద్రానికి వస్తుంటారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయి వైద్య సేవలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు లేక బోధన్, నిజామాబాద్ ఆసుపత్రులకు తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 30పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడంతో 24గంటల వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగం సాయిలు, అశోక్, హన్మాండ్లు, దత్తు, కిరణ్, శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బోధన్‌రూరల్,మే26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుపరుస్తుందని బోధన్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, డబ్బు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబడతాయన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, బిల్లులు విడతల వారిగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి నవీన్, ప్రమోద్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండలం దేగాంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపీడీవో గంగాధర్, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ యాల్ల సాయిరెడ్డి మార్కింగ్ ఇచ్చారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాంబాబు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రమోద్, బోజారెడ్డి, సాయన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి:మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం పలు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని, విడతల ప్రకారం బిల్లులు మంజూరవుతాయని మాజీ సర్పంచ్ షేక్ గౌస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, ఆసియా బేగం, అనిత, పంచాయతీ కార్యదర్శి సునంద తదితరులున్నారు.

పెర్కిట్ పాఠశాలలో బడిబాట

ఆర్మూర్ రూరల్ , మే26(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని ప్రధాన ఉపాధ్యాయులు కనీసం 10 నుంచి 20 శాతం వరకు తమ పిల్లల సంఖ్య పెంచుకో వాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండలక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి

ఆర్మూర్ టౌన్, మే26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొండ లక్ష్మన్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కొండలక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రాపోలు జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీన బాపూజీ విగ్రహాల ముందు జాతీయ పతక ఆవిష్కరణ చేసి ర్యాలీలో నిర్వహించాలని వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించి 1969 లో కేబినెట్ పదవికి రాజీనామ చేశారన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పోరాటం చేసి రాష్ట్రసాధన కోసం సర్వస్వ త్యాగం చేసిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు రైల్వేబోర్డు డైరెక్టర్ బొడ్డు గంగాధర్, జిందం నరహరి, శేఖర్, రవికుమార్, నరేందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పూర్‌లో జింకపై వీధి కుక్కల దాడి



ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగిస్తున్న దృశ్యం

కోటగిరి,మే26(ఆంధ్రజ్యోతి):కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం జింకపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే వ్యవసాయ పొలంలో దారి తప్పి వచ్చిన జింకను వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు గమనించి వీధి కుక్కలను తరిమివేశారు. గాయాలపాలైన జింకను గ్రామంలోకి తీసుకువచ్చి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వర్ని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సురేష్ గ్రామానికి చేరుకుని గాయాలపాలైన జింకను కోటగిరి పశువైద్య శాలకు తరలించారు.పశువైద్య అధికారి సురేష్ జింకకు చికిత్స అందించినప్పటికీ మృతి చెందింది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి రాజు, గ్రామస్థులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే అధిక దిగుబడి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారిని దేవిక

జక్రాన్‌పల్లి, మే26(ఆంధ్రజ్యోతి):రానున్న వర్షాకాలంలో పంటల సాగులో వ్యవసాయ శాస్త్ర వేత్తలు ఇచ్చిన సూచనలు సలహాలు పాటిస్తే పంట అధికదిగుబడి వస్తుందని రుద్రూర్ ప్రాం తీయ వరిపరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏకృష్ణచైతన్య అన్నారు. సోమవారం మండలం లోని కలిగోటలో రైతుముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడొద్దని మోతాదును బట్టి వాడాలని అన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు.ఆధారిత ఎరువులు యాజ మన్యం చేపట్టాలన్నారు. బాస్వరం ఎరువులను దుక్కిలో మాత్రమే వేసుకోవాలని పైపాటుగా వేయకూడదన్నారు. అనంతరం ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిం చారు. బోధన సహచారుడు ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల శాస్త్రవేత్త సతీష్ మాట్లాడుతూ పంటల సాగులో తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటించి పంట లాబాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కొలిప్యాక్ సొసైటీ అధ్యక్షుడు నార్ల శ్రీనివాస్, ఏవో దేవిక, జయశంకర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ సలహ కమిటి సభ్యుడు కోటపాటి నర్సింహనాయుడు. ఏఈవోలు , రైతులు పాల్గొన్నారు.

సావెల్ సొసైటీలో మహజన సభ

మెండోర, మే26(ఆంధ్రజ్యోతి): మెండోర మండలం సావెల్ సొసైటీ మహజన సభ సోమవారం చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈసంద ర్భంగా పలు తీర్మాణాలను ఆమోదించారు.సొసైటీ పాత బకాయిలతో ఇప్పుడున్న పాలకవర్గానికి ఎలాం టి సంబందం లేదని మహజన సభలో తీర్మాణిం చారు. పాత పాలకవర్గం చేసిన అప్పులను విచారణ జరిపి నోటీసులు ఇచ్చిబకాయిలు వసూలు చేయా లని అకాల వర్షాలకు తడిసిన వరిధాన్యం కొనుగోలు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధికారిఅబ్దుల్ బారిక్,మహేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మహజన సభలో సొసైటీ చైర్మన్ డైరెక్టర్లు

కమలాపూర్‌లో విషాదం

నవీపేట,మే26(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో పుణ్య స్నానానికి వెళ్లిన మండలంలోని కమలాపూర్‌కు చెందిన బొల్లమల్ల రాజు(40) ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. ఆదివారం స్వగ్రామంలో తన కుమారుడు, కుమార్తెలకు నూతన వస్త్రధారణ కార్యక్రమం నిర్వహించగా సోమవారం తమ సమీప బంధువులతో కలిసి బాసర గోదావరిలో పుణ్య స్నానానికి వెళ్లాడని గ్రామస్థులు పేర్కొన్నారు. కూలీ పని చేసుకుని జీవించే రాజు ప్రమాదవశాత్తు గోదావరి మునిగి మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రాజు అంత్యక్రియలను మంగళవారం కమలాపూర్‌లో నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి తీవ్రగాయాలు

నవీపేట,మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరి సమీపంలో ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. పొతంగల్ మండలం జల్లాపల్లి ఫారంకు చెందిన రాంసింగ్ ఠాగూర్ తన సోదరుడి కుమారుడు సుమిత్‌తో కలిసి బైక్‌పై బైంసా వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొందని, ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న రాంసింగ్ ఠాగూర్ కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. బాధితుడిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఏఎస్ఐ వివరించారు. బాధితుడి సోదరుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్‌రూరల్,మే26(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రుక్మిణి అనే మహిళ వాంతులు, విరోచనాలతో పాటు ఊపిరితిత్తుల్లో నిమ్ము ఉండడంతో చికిత్స నిమిత్తం వచ్చిందన్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రి వైద్యులు సీపీఆర్ చేశారన్నారు. చికిత్సలోనే ఆమెకు గుండెపోటుతో రావడంతో మృతి చెందిందని తెలిపారు. రుక్మిణికి వైద్యం అందించడంలో వైద్యులు పూర్తిస్థాయిలో చికిత్స అందించినప్పటికీ గుండెపోటు రావడంతో మృతి చెందిందన్నారు. కుటుంబీకులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

జక్రాన్‌పల్లి, మే26(ఆంధ్రజ్యోతి):రానున్నది వర్షకాలం అయినందున సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటి డీఎం అండ్‌హెచ్‌వో రమేష్ సూచించారు. సోమవారం జక్రాన్‌పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయ ఇతర వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి రవీందర్, డివిజన్ అధికారి సాయి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పొతంగల్‌లో ఘనంగా 108పైలెట్ దినోత్సవం

కోటగిరి,మే26(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం 108పైలెట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108సిబ్బందికి బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం బీజేపీ నాయకులు హన్మాండ్లు మాట్లాడుతూ 108సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ గర్భిణీలు, క్షతగాత్రులకు ఆసుపత్రులకు తరలించడంలో చేస్తున్న కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో 108సిబ్బంది ముందున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి రెండు రోజులు జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్, మే26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడ్డ పలువురికి సెకండ్‌క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ సోమవారం రెండురోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డగఫర్, ప్రచుత్,రాజాగౌడ్, ప్రశాంత్,నితిన్, రవిగౌడ్, సాయిలు, శ్రీనివాస్,గౌతమ్, ప్రశాంత్‌లను కోర్టులో హాజరుపర్చగా రెండురోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.అంతకు ముందు డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వారికి ఎస్‌హెచ్‌వో కౌన్సిలింగ్ నిర్వహించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి జైలుశిక్ష

బాల్కొండ:బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి మద్యంతాగి వాహనాలు నడుపుతు పట్టు బడిన రాజు, సిద్ధం, ప్రవీణ్‌లకు ఆర్మూర్ సెకెంట్ క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యఖర్చుల నిమిత్తం స్నేహితుల ఆర్థిక సహాయం

ఆర్మూర్ టౌన్, మే26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కే. నరేష్ కుటుంబ సభ్యులకు వైద్యఖర్చుల నిమిత్తం 10వ తరగతి స్నేహితులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల నరేష్ అనారోగ్య భారీన పడి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుసుకున్న పదవ తరగతి స్నేహితులు తమవంతుగా డబ్బులను జమచేసి రూ.లక్ష 1వేయి 500 లు రూపాయలు నరేష్ తల్లికి అందజేశారు.

సజ్జ పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

ఆర్మూర్ రూరల్ , మే26(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలో రైతులకు చెందిన సజ్జ పంటలను మండల వ్యవసాయాధికారి హరిక్రిష్ణ పరిశీలించారు. గత ఐదురోజులుగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని మొలకలు వచ్చినట్లు గుర్తించారు. సజ్జ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నిశీకాంత్, రైతులు రాజమల్లు, నరేష్, ఇజప్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం నిల్వల పరిశీలన

కమ్మర్‌పల్లి, మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్‌లోని కొనుగోలు కేంద్రం, కల్లాలలో ఉన్న తడిసిన వరిధాన్యాన్ని సోమవారం తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు కురుస్తున్న కారణంగా వరిధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిధాన్యం తడవకుండా టార్పలిన్ లు కప్పిఉంచాలని లారీలు హమాలీల కొరత రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శరత్, రైతులున్నారు.

ప్రవీణ్‌శర్మకు బాల సాహిత్య ఉపాధ్యాయ పురస్కారం



పురస్కారం అందుకున్న ప్రవీణ్ శర్మ

ఏర్గట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో తెలుగు పండితుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ శర్మ బాల సాహిత్య ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. బాల సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్న బాల సాహితీవేత్తలకు అలాగే ఉపాధ్యాయులకు తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ వారు ఆదివారం రాత్రి ఈ పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా విద్యార్థులచే అనేక పుస్తకాలు, సాహిత్య రంగంలో విద్యార్థుల సృజనాత్మకతను, నైపుణ్యాన్ని బయటకు తీస్తూ జాతీయ స్థాయిలో విద్యార్థులు గుర్తింపు తెస్తున్నందు గాను ప్రవీణ్ శర్మను అభినందిస్తూ ప్రముఖుల చేతుల మీదుగా బాల సాహిత్య ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడాలి

● ఆర్మూర్ ఏసీసీ వెంకటేశ్వర్‌రెడ్డి



మొక్కను నాటుతున్న ఏసీపీ

ఆర్మూర్‌రూరల్,మే26(ఆంధ్రజ్యోతి):ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు.సోమవారం ఆర్మూర్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయ ఆవరణలో సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ తో కలిసి పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతీ ఒక్కరి పాత్ర ఉంటుందని ప్రభుత్వ కార్యాలయాలు,కళాశాలలు, పాఠశా లల్లో, వివిధ కాలనీలలో మొక్కలు నాటి కాలుష్య నివారణకు జీవవై విద్యానికి తోడ్పడాలన్నారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని రక్షిస్తుం దని అన్నారు. ప్రతీ ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వృక్షో రక్షిత రక్షత ధర్మాన్ని పాటించాలని అన్నారు.ఈకార్యక్రమంలో శేఖర్, ఫారుక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరు సహకరించాలి



బస్టాండ్‌లో కళాజాతా దృశ్యం

బోధన్‌రూరల్,మే26(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని బోధన్ బస్టాండ్ ప్రాంగణంలో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు నాటికలు, పాటల రూపంలో సామాజిక అంశాలపై సందేహలు అందించారు. రోడ్డు భద్రతపై అవగాహన, రోడ్డు భద్రత నియమ, నిబంధనలను ప్రజలకు వివరించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లవద్దన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏదైనా అసౌకర్యానికి గురైనప్పుడు షీటీమ్ నెంబర్, 100డయల్‌కు ఫోన్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కోటగిరి,మే26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లీ కాలనీలో సోమవారం నీలి గంగాలక్ష్మి అనే మహిళ మృతి చెందింది. ఆమె అంత్యక్రియల నిమిత్తం రవి యువసేన ఆధ్వర్యంలో ఆర్థిక సహయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, యోగేష్, అశోక్, సంతోష్, పోతయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత గల పురుగుల మందులను విక్రయించాలి

జుక్కల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగు మందుల దుకాణం యజమానులు నాణ్యత గల పురుగుమందులను రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి మహేశ్వరి అన్నారు సోమవారం రోజు పురుగు మందుల దుకాణం తనిఖీ చేసి అనంతరం ఆమె దుకాణం యజమానులతో మాట్లాడినారు ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సమయంలో రైతులు సోయ విత్తనాలు విత్తుకుంటారు. రైతులకు అవసరమవు ఎరువులు పురుగు మందులు విక్రయించి దుకాణం యజమానులు రైతులకు రసీదు ఇవ్వాలని ఆమె అన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే వారి దుకాణాలను గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. దుకాణంలో ఎరువుల నిల్వలు, విత్తనాలు స్టాక్ ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆమె అన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు : తహసీల్దార్

నసురుల్లాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని నసరులాబాద్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రేషన్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటవ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు మండలంలోని అందరు రేషన్ కార్డుదారులకు మూడు నెలల సరుకులు అనగా జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యము ఒకేసారి ఇవ్వబడతాయని అన్నారు. ప్రతి ఒక్క కార్డుదారుడు ఒకేసారి మూడు నెలల బియ్యం పూర్తిగా తీసుకోవాలని అన్నారు. ప్రజా పంపిణీలో రేషన్ డీలర్లు అందుబాటులో ఉంటూ బియ్యాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వేగం పెంచిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు

జుక్కల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం కండెవల్లూరు బస్వాపూర్ రహదారిపై తడిసిన వడ్ల కుప్పలు పగబట్టిన ప్రకృతి నత్త నడకన కొనుగోలు కేంద్రాలు అనే వార్త సోమవారం రోజు ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో కథనం ప్రచురించడంతో జుక్కల్ మండల వ్యవసాయ అధికారి కొనుగోలు కేంద్రాలు పరిశీలించి కొనుగోలు ప్రక్రియ వేగం పెంచారు. జుక్కల్ మండలంలో ఐకెపి సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సొసైటీ కొనుగోలు నిర్వాకులు వారి టార్గెట్ పూర్తి చేశారు. ఇప్పటి వరకు సుమారు 60 లారీలలో ధాన్యం బస్తాలను రైస్ మిల్‌కు తరలించామని ఆమె అన్నారు. ఇకముందు ధాన్యం కొనుగోలుపై నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆమె అన్నారు.

ప్రజావాణికి అధికారులు రారు.. సమస్యలు పరిష్కరించరు

నసురుల్లాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టే ప్రజావాణి కార్యక్రమం మండలంలోని అయా శాఖల అధికారులు హాజరు కాకపో వడంతో ప్రజావాణి కార్యక్రమంలో కాలి కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రజావాణి కార్యక్రమనికి మండలంలోని ఆయా శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. సోమవారం మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి కేవలం ముగ్గురు అధికారులు మాత్రమేహాజరు కావడం గమనార్హం.ఇప్ప టికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రజావాణి కార్యక్రమానికి మండలఅధికారులు హాజరై ప్రజాసమస్యలు పరిష్కరించాలని వాపోతు న్నారు.

ప్రాచీన క్రీడకు నేడు గుర్తింపు

● కర్రసాము ద్వారా ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం ● బాలభవన్‌లో ప్రతియేటా కర్రసాము శిక్షణ ● శిక్షణలో రాటుదేలుతున్న విద్యార్థులు

సుభాష్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇదో ప్రాచీన క్రీడ.. ఇప్పుడు ప్రపంచాన్ని ఏలుతున్న మార్షల్ ఆర్ట్స్‌కు ఒక రకంగా తల్లిలాంటిది. ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యాన్ని అందించే ఆ విద్య దాదాపు కనుమరుగైపోయింది. ఇతిహాస, జానపద చిత్రాల్లో అప్పటి హీరోలకు పేరు తెచ్చి పెట్టిన ఆ విద్యకు ఇప్పుడిప్పుడే గుర్తింపు వస్తుంది. రాష్ట్రస్థాయిని దాటి జాతీయస్థాయిలో ఉనికి చాటుకుంటుంది. అదే కర్రసాము.. చేతి మునివేళ్లతో పొడవాటి కర్రను అవలీలగా ఆడించే ఈ విద్య ఇప్పుడు చిన్నారుల్లో ఆసక్తి పెంచుతుంది. నిజామాబాద్ నగరంలోని బాలభవన్ కేంద్రంగా సాగుతున్న కర్రసాము శిక్షణపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఇదో ప్రాచీన క్రీడ

ప్రాచీన యుగం మొదలు రాజుల కాలం వరకు కర్రసాము ప్రధానమైన క్రీడ. ఇదో ఆత్మరక్షణ విద్య కూడా. పొడవాటి కర్రతో తమను తాము రక్షించుకోవడమే కాకుండా మరికొందరిని కూడా కాపాడే పోరాట పటిమ ఉంది ఈ విద్యలో కర్రద్వారా సాధన చేసే ఈ విద్య బల్లెం, తల్వార్, కత్తుల్లాంటి ఆయుధాలతో కూడా చేయవచ్చు. ఉత్తి చేతులతో సాధన చేసే విద్య కాలక్రమంలో కరాటే, కుంగ్ఫూగా రూపాంతరం చెందింది. ఇవన్నీ ప్రస్తుతం మార్షల్ ఆర్ట్స్‌గా ప్రపంచాన్ని ఏలుతున్నాయి. అయితే వీటన్నింటికి మూలాధారమైన కర్రసాము దాదాపు కనుమరుగై పోయింది. అప్పుడప్పుడు సినిమాల్లో తప్ప కర్రద్వారా ఫైట్ చేసే సన్నివేశాలు కనిపించడం లేదు. ఆధునిక యుగంలో కర్రను ఉపయోగించడమే మానేశారు. ఇదొరకమైన ఆత్మ రక్షణ విద్య ఉందన్న విషయం కూడా మరిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో గత కొన్ని సంవత్సరాలుగా కర్రసామును ప్రచారంలోకి తెస్తున్నారు. కొందరు ఔత్సాహికులు నిజామాబాద్ నగరంలోని బాల భవన్‌లో ఏటా వేసవి సెలవుల సమయంలో చిన్నారులకు కర్ర సాముపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో సుమారు వందల మంది విద్యార్థులు ప్రతి యేటా శిక్షణ పొందుతున్నారు. వీరిలో చాలామంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. కర్రసాము పోటీల్లో పలు పతకాలను సాధించారు.

తమిళనాడు నుంచి జిల్లాకు ..

ఈ కర్రసాముకు ఇప్పుడు గుర్తింపు రావడంలో తమిళుల పాత్ర కీలకంగా ఉంది. తమిళనాడులోని సిలంబం ప్రాంతానికి చెందిన వారు అసోసియేషన్‌గా ఏర్పాటు చేసి జాతీయస్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో పోటీలను ఏర్పాటు చేశారు. వారిచ్చే స్ఫూర్తితో తెలంగాణ జిల్లాలో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. నిజామాబాద్ నగరంలో నటరాజ్‌తో పాటు శ్వేత కర్రసాము ప్రచా రంలోకి తెస్తున్నారు. అతిప్రాచీనమైన ఈ విద్యను నేటి తరానికి నేర్పాల్సిన అవరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. మార్షల్ ఆర్ట్స్‌కు మూలధారమైన కర్రసాముపై ఇప్పుడిప్పుడే ఆసక్తి పెరుగుతుంది.

బాలభవన్ కేంద్రంగా కర్రసాము శిక్షణ

నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని బాలభవన్‌లో ప్రతి రోజు ఉదయం,సాయంత్రం వేళల్లో కర్రసాము శిక్షణ సాగుతుంది. పదేళ్లలోపు చిన్నారులు మొదలు యువతీ యువకులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు ఆత్మ స్థైర్యం పెంచేందుకు కర్రసాము ఉపయోగపడుతుందని విద్యార్థులు చెబుతున్నారు. తమను తాము రక్షించడంతో పాటు మరి కొందరిని కాపాడేందుకు ఈ విద్య పని కొస్తుందని వారంటున్నారు. కేవలం వేసవి సెలవుల్లోనే కాకుండా మిగతా రోజుల్లో కూడా ఇలాంటి శిక్షణ శిబిరాలు నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు.



కర్రసాములో పోటీ పడుతున్న దృశ్యం




కర్రసాము చేస్తున్న విద్యార్థులు



ఆత్మరక్షణ కోసం శిక్షణ తీసుకుంటున్నా..
(నిహారిక, విద్యార్థిని)

సమాజంలో ప్రస్తుతం మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువవుతున్నాయి. తమను తాము రక్షించేందుకు మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరిగా నేర్చుకోవాలి. మార్షల్ ఆర్ట్స్‌కు తల్లయిన కర్రసామును గత కొన్నేళ్లుగా నేర్చుకుంటు న్నాను. తాను ఏ అపాయం వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఎంతో ఉపయోగపడుతుంది.



కర్రసాము ద్వారా ఆత్మస్థైర్యంపెరుగుతుంది..
(ప్రవళిక, విద్యార్థిని)

గత కొన్ని సంవత్సరాలుగా కర్రసాములో శిక్షణ తీసుకుంటున్నాను. ఆత్మరక్షణతో పాటు కర్రసాము ద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుంది. పది సంవత్సరాల నుంచి బాలికలు యుక్తవయస్సు దాకా కర్రసాము శిక్షణ తీసుకోవాలి. బాలభవన్‌లో కర్రసాము ప్రతిరోజు నేర్పించేలా నిర్వాహకులు కృషిచేయాలి.



మహిళలు తప్పనిసరిగా కర్రసాము నేర్చుకోవాలి ..
(శ్వేత, శిక్షకురాలు)

మహిళలు ప్రతి ఒక్కరు కర్రసామును నేర్చుకోవాలి. కర్రసాము నేర్చుకోవడం ద్వారా మానసికంగానే కాకుండా శారీరకంగా ధృడంగా తయారవుతాము. ప్రతియేటా బాల భవన్‌లో వందలమంది విద్యార్థులకు కర్రసాము నేర్పిస్తున్నాము. కర్రసాము నేర్చుకోవడం ద్వారా మహిళలు తమనుతాము రక్షించుకోగలుగుతారు. ప్రస్తుత సమాజంలో మహిళల పట్ల దాష్టికాలు జరుగుతున్న నేపథ్యంలో ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరు కర్రసాము నేర్చుకోవాలి.



సిద్దుల గుట్టపై పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పల్లకీ సేవ

పెర్కిట్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటి ఆధ్వర్యంలో పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. సిద్దుల గుట్టపై భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతాలు, బిల్వ పత్రాలతో అభిషేకం చేశారు. రామాలయం, దుర్గమాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ తల్లి, ఏకశిల స్తంబం వద్దగల హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి సేవలో నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు. సిద్దుల గుట్టపై కాటేజీల నిర్మాణాలకోసం విరాళాలు ఇవ్వదల్చుకున్న వారు ఆలయ కమిటి సభ్యులను సంప్రదించాలని తెలిపారు. భక్తుల సహాయసహకాలతో నిర్వహిస్తున్న అన్నప్రసాదం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు డి. సుమన్, వీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బొండ్ల ఆనంద్, రవి, భట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, అజాని సతీష్, సిద్దుల గుట్ట సేవాసమితి పాల్గొన్నారు.

కమనీయంంగా బీరప్ప కల్యాణం

బోధన్‌రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో సోమవారం బీరప్ప, కామరతి కల్యాణ మహోత్సవాన్ని కుర్మ కులస్థులు కమనీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుబ గంగాదర్, కుర్మ కులస్థులు పాల్గొన్నారు. కుర్మ కులస్థుల ఆరాధ్యదైవం అయిన బీరప్ప ఆలయంలో ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కుల ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురియాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం కుల పెద్దలు, గ్రామ పెద్దలు, బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, బోధన్ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ఎడపల్లి కోలా ఇంద్రకరణ్, యువ నాయకులు సంగ్రామ్ పటేల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బీరప్ప కల్యాణ మహోత్సవం దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

● వేల్పూర్ మండల వీధుల్లో కంపుకొడుతున్న మురికి కాలువలు ● రోడ్లపైనే చెత్తచెదారం● పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



వేల్పూర్‌లో డ్రైనేజీపై ఉన్న కల్వర్టు పగిలి మురికి నీరు నిలిచిన దృశ్యం

డ్రైనేజీ నుంచి తీసిన మురికి చెత్తకుప్పలు





చెత్తచెదారంతో నిండిన డ్రైనేజీ



పచ్చల నడ్కుడలో ఎస్సీ కాలనీ రోడ్డులో ముళ్లపొదల వద్ద ఉన్న డ్రైనేజీ

వేల్పూర్, మే26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీ పాలక వర్గం లేకపోవడంతో జీపీ అధికారులు పారిశుధ్యంపై శ్రద్ధ చూపడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల్లో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిం డిపోయి కంపుకొడుతున్నాయని వాటిని తొలగించి శుభ్రం చేయాలని జీపీ అధికారులకు పలుమార్లు విన్నవించిన తమకేమి పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ్‌భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి కార్యక్రమాలు కేవలం వాల్‌పోస్టర్లు, బ్యానర్లతో ప్రచారానికి పరిమితం అయ్యాయి. వీధి రోడ్లకు వెళ్లేందుకు గాను గతంలో మురికి కాలువలపై నిర్మించిన చిన్న కల్వర్టు స్లాబ్‌లు పగిలిపోవడం వల్ల మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీ ప్రజలు ఆవేధన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు ముళ్ల పొదల మధ్యనుంచి ఉండడం వల్ల పారిశుధ్య కార్మికులు వాటిని తొలగించడం లేదు. దీంతో మురికి కాలువలో వచ్చే చెత్తచెదారం ముళ్లపొదలకు తట్టుకుని మురికి నీరు వెళ్లకుండా అడ్డుగా ఉండడంతో మురికి బురదనీరు రోడ్లపై పారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడపదడపగా డ్రైనేజీల నుంచి తీసిని చెత్తచెదారం బురద మట్టిని డ్రైనేజీ పక్కన రోడ్డుపై వేసి ఉంచడంతో సకాలంలో మట్టికుప్పలను తొలగించకపోవడంతో తిరిగి డ్రైనేజీల్లోకి చేరడం వల్ల డ్రైనేజీ నిండిపోయి మురికి నీరు రోడ్లపైకి వస్తుందని వాపోయారు. దీంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి రోగాల భారీన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలపై గతంలో నిర్మించిన కల్వర్టులు డ్రైనేజీలకు ఉన్న ఫైడర్ రాళ్లు కూలిపోయి ఉన్న దృశ్యాలు పలు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి.

చెత్తకుండీలు లేక రోడ్లపైనే చెత్తకుప్పలు ..

గ్రామాల్లోని వీధుల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇంటింటా చెత్త చెదారాన్ని రోడ్లపై పారవేస్తున్నారు. దీంతో గ్రామాలలో ప్రధాన రోడ్లతో పాటు వీదిరోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఖరీఫ్ పంట కాదండోయ్.. పరిగె పంట!

పెద్ద కొడప్‌గల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి నియోజక వర్గంలోని ఆయా మండలాలలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు భూమిలో ఉన్న విత్తనాలు మొలకెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలో పాటు రహదారి పక్కన, పంట పొలాల్లో ఉన్న విత్తనాలు మొలకెత్తుతున్నాయి. రైతన్నలు రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న, జొన్న, వరి పంటలు సాగు చేసి పంట చేతికి రాగానే కోతలు పూర్తి చేశారు. ఆ సమయంలో పంటకు సంబంధించిన విత్తనాలు కొంత మేర భూమిలోనే ఉండిపోయాయి. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ విత్తనాలన్నీ మొలకెత్తి కొత్తగా పంటలు సాగు చేసిన విధంగా కనబడుతున్నాయి. ఈ విధంగానే మండలంలోని ఓ గ్రామ శివారులో రైతు చేల్లో మొక్క జొన్న పంటకు సంబంధించిన పరిగె విత్తనాలతో పంట ఏపుగా పెరుగుతుంది. ఎవరైనా కొత్తవారు చూస్తే అప్పుడే మొక్క జొన్న పంట సాగు చేశారన్న సందేహం కలుగుతుంది. ఈ చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

ఏపుగా పెరిగిన మొక్క జొన్న పంట →



వానాకాలం సాగుకు రైతాంగం సమాయత్తం

● నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఏడాది 1,35 వేల ఎకరాల సాగుకు ప్రణాళిక ● వర్షాకాలం సాగుకు సాగునీరు ఢోకా లేదు.. ● బోరు బావుల వద్ద వరి నారును పోస్తున్నరైతాంగం ● ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కిని సిద్ధం చేసిన రైతులు

నిజాంసాగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు కిందట ఉమ్మడి జిల్లాల రైతులు ముందస్తుగానే వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి పుష్కలంగా యాసంగికి లక్ష 15 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 5.486 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇటీవల అడపా దడపా వర్షాలు కురవడంతో నిజాంసాగర్ రైతాంగం ముందుస్తుగానే వరి నారుమల్లు పోస్తున్నారు. రైతులు వరి సాగు భూముల్లో దుక్కిని సిద్ధం చేసుకుంటున్నారు. ఏడాది వర్షాకాలం ముందస్తుగానే వారి నాట్లు వేయాలని ఆలోచనలో ఉన్నారు. ఏడాది నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిలువలు ఉండడంతో ఇక వర్షాకాలం సాగుకు ఢోకా లేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏ వర్షాకాలం ప్రారంభం కాకముందే మే చివరి వారంలో అల్పపీడనం సంభవించి నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురియడంతో ఇక ముందస్తుగానే వర్షాకాలంలో వర్షాలు ధీమాలో ఉన్నారు. రైతులు ఇప్పటికే నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకొని వరి నారుమళ్లు పోసుకుంటున్నారు. రైతులు ఇప్పటికే రసాయనిక ఎరువులను విలువ చేసుకున్నారు. ప్రభుత్వం సింగిల్ విండోలకు ఇప్పటివరకు వరి విత్తనాలు, రసాయన ఎరువులు, ప్రైవేట్ ఏజెన్సీల వద్ద కొనుగోలు చేసుకున్నారు. ముందస్తు వరి నాటికి వేయాలని రైతులు ఆలోచనలకు ఇప్పుడే జార్ఖండ్, బీహార్ కూలీలు గ్రామాలలోని పెద్ద రైతులతో ములఆకత్ అవుతూ ఎకరాకు 4,500 చొప్పున చెల్లిస్తే వరి నాట్లు వేస్తామని రాజీ కుదిరించుకుంటున్నారు. ఏడాది వర్షాకాలంలో కూలీల కొరత ఉండదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు రైతులకు రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఏడాది నిజాంసాగర్‌లో నీటి నిల్వలు ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



బోరు బావుల వద్ద పెరుగుతున్న వరి నారు



ఆయకట్టు కింద దుక్కిని సిద్ధం చేసిన దృశ్యం



నిజాంసాగర్ ఆయకట్టు కింద వరి నారు కోసం పోసిన వరి నారుమడి



నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు టీఎంసీల నిల్వలు ఉన్న దృశ్యం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

డబుల్‌బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన

భిక్కనూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని డబుల్‌బెడ్ రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు సోమవారం భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను తమకు వెంటనే అందజేయాలని, ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్ ఇళ్లు మందుబాబులకు అడ్డాగా మారాయని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శృతికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తునికి వేణు, బోండ్ల రాంచంద్రం, బస్వయ్య, చంద్రం, బసగల్ల రవి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

రామారెడ్డి, మే26 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎరువులనే అమ్మాలని, ప్రతీ రైతుకు అమ్మిన వాటికి సంబంధించిన రశీదులు ఇవ్వాలని రామారెడ్డి మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ దుకాణ యజమానులను ఆదేశించారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డి పేట గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్లు స్టాక్‌ఎంట్రి కోసం రిజిష్టర్లను నిర్వహించాలని, విత్తన కంపెనీ వివరాలు, విత్తనాల పీసీలు ఇన్వాయిస్‌లు పెట్టుకోవాలని సూచించారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలను కొనుగోలు చేయరాదని, లైసెన్స్ పొందిన డీలర్ల నుండి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని పలు సలహాలు సూచనలు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సహయ వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి

సదాశివనగర్: ప్రభుత్వగుర్తింపు ఉన్న కంపెనీ విత్తనాలను, లైసెన్స్‌లు ఉన్న డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొను గోలు చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి అన్నారు. సోమ వారం మండలకేంద్రంలో విత్తన, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పకుండా రసీదు తీసుకుని భద్రంగా ఉంచుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

రామారెడ్డి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి క్రీడాకారులు ఎంపికైనట్లు సోమవారం పీడీ బాల్‌రాజు తెలిపారు. జూన్ 1న జింఖానా గ్రౌండ్ జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 600 మీ రన్‌లో స్నేహిత, 300 మీ రన్‌లో పోచవ్వ, ఎన్. సాత్విక, 60 మీ రన్‌లో సాత్విక, సిద్దు, లాంగ్ జంప్‌లో శరణ్యలు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవంతం కోసం కృషి చేయాలని పీడీ కోరారు.

గోవులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

మహమ్మద్‌నగర్, మే26 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలం బోగ్గుగుడిసె దగ్గర అక్రమంగా గోవులను తరలిస్తున్న బోలేరో వాహనాలను బజరంగ్‌దళ్ నాయకులు పట్టుకున్నారు. రెండు వాహనాలలో మొత్తం 9 గోవులను తరలిస్తున్నారని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోవులను తరలిస్తున్నారని గుర్తించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బిచ్కుంద మండలంలోని సోమయప్ప గోశాలకు తరలించారు. అక్రమంగా గోవులను తరలిస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలని బజరంగ్‌దళ్ నాయకులు పోలీసులను కోరారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

● జేసీబీ, టిప్పర్ పట్టుకున్న పోలీసులు

బీర్కూర్, మే26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం పరిధిలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. సోమవారం స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఒక జేసీబీ, ఒక టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని నిరసన

కామారెడ్డిటౌన్,మే 26(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్లలో స్థలాల్లో నివాసముంటున్న పేద ప్రజలకు కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు కొత్తనర్సింలు, చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షబ్బీర్‌అలీ మంత్రిగా పనిచేసిన సమయంలో ఇండ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులతో పాటు పేద ప్రజలను బెదిరింపులకు గురిస్తే మంచినీళ్లు, కరెంటు సౌకర్యాలు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ తీరును మార్చుకోకపోతే జంగంపల్లి భూ పోరాట సభ్యులకు మద్దతుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవరాజు,నర్సింలు, నారాయణ, లక్ష్మీ, రమణ, బాలపుష్యామల తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత సిద్ధమేశ్వరనగర్

భిక్కనూరు, మే26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో గత వారం రోజులుగా సిద్దరామేశ్వరనగర్ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల నుంచి 8జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా విజేతగా సిద్దరామేశ్వరనగర్ జట్టు నిలవగా రెండవ స్థానంలో భిక్కనూరు నిలిచిందన్నారు. మొదటి బహుమతి రూ.3వేలు, రెండవ బహుమతి రూ.1500లతో పాటుగా ఇరుజట్లకు మెమెంటోలు ఇచ్చిటనట్లు వెల్లడించారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

నాగిరెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో 50 శాతం ప్రభుత్వ రాయితీపై వచ్చిన జీలుగ విత్తనాలను సోమవారం సొసైటీ అధ్యక్షుడు నర్సింలు రైతులకు పంపిణీ చేశారు. ప్రస్తుతం సొసైటీకి వంద బస్తాల జీలుగా విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. 30కిలోల బస్తా ఒకటికి 50 శాతం సబ్సిడీపై రూ.2,137.50 పైసలకు రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. జీలుగా విత్తనాలు అవసరం ఉన్న రైతులు సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అలాగే సొసైటీలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం వడ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎంటీయూ 1010 రకం 300 బస్తాలు, ఆర్ఎన్ఆర్ 15,048 రకం 100 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవో సాయి కిరణ్, సొసైటీ డైరెక్టర్ వంశీకృష్ణగౌడ్, సీఈవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న సొసైటి అధ్యక్షుడు



లైసెన్స్‌లు కలిగిన సర్వేయర్లు

శిక్షణలో ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలి

● కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



శిక్షణ తీసుకుంటున్న వారికి మెటీరియల్‌ను అందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ కలిగిన సర్వేయర్లు శిక్షణలో ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలని, శిక్షణ అనంతరం ప్రభుత్వ పరంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండునెలల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు కలిగిన సర్వేయర్లకు ప్రభుత్వం రెండు నెలల పాటు శిక్షణ ఇస్తోందని అన్నారు. శిక్షణలో ప్రతీ అంశాన్ని శిక్షకులు నుంచి సర్వేయర్లు తెలుసుకోవాలని, శిక్షణ తర్వాత ప్రభుత్వపరంగా విధులు బాధ్యతతో నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. మొదటి విడుతలో 131 మందికి శిక్షణ ఇస్తున్నామని, ప్రతీ రోజు ఉదయం పూట తరగతి గదిలో థియరీ, మధ్యాహ్నం పూట ప్రాక్టికల్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. భూ భారతి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న పట్టాదారుని యొక్క భూములకు సంబంధించిన కొలతలు, మ్యాప్‌లు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. శిక్షకులు అన్ని అంశాలను బోధించాలని తెలిపారు. అంతకముందు అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ నిజాంకాలంలో భూముల కొలతలు కొలవడం జరగాయని, మళ్లి 1989-90లో భూముల హక్కులను అప్‌డేట్ చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్‌లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన తర్వాత ప్రభుత్వపరంగా బాధ్యతతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. దీని వలన రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం శిక్షణ మెటిరియల్ శిక్షణ సర్వేయర్‌లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూ కొలతల సహాయ సంచాలకుడు శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణ పత్రం అందిస్తున్న ఈఓ, నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దోమకొండ, మే26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని పంచాయతీ కార్యదర్శి యాదగిరి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పనులను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీతారం మధు, నల్లపుశ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఆశాబోయిన శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, బత్తిని సిద్ధిరాములు, షమ్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాల పంపిణీ

మహమ్మద్‌నగర్: మహమ్మద్‌నగర్ మండలం గిర్నితండాలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను సోమవారం ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిలు అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఎస్‌టీసెల్ అధ్యక్షుడు సవాయిసింగ్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భిక్కనూరు, మే26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు అన్నారు. సోమవారం భిక్కనూరు మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఎస్పీ ఆదేశాల మేరకు కళాబృందం సభ్యులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై, బ్యాంకు మేనేజర్ శివాని మాట్లాడుతూ ఏదైనా ఊరేళ్తే ఇంట్లో బంగారు అభరణాలను ఉంచవద్దని, ఎవరికి వ్యక్తిగత విషయాలను ఎవరికీ చెప్పవద్దని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బాన్సువాడటౌన్, మే26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమతులు లేకుండా ప్రారంభిస్తున్న నూతన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇందులో ఏఐఎస్‌బీ, బీసీ విద్యార్థి సంఘం, టీఎన్ఎస్ఎఫ్, జీఎస్, సంఘాల నాయకులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం

● డీఆర్‌డీవో మురళీకృష్ణ

మద్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): అతివల ఆర్థిక స్వలంబన కోసం ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తున్నాయని డీఆర్‌డీఓ మురళీకృష్ణ అన్నారు. సోమవారం మద్నూర్ మహిళా సమైక్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదుగుతున్నారని గుర్తుచేశారు. బ్యాంకు లింకేజీ, రుణాల రికవరీ, స్త్రీ నిధి రికవరీలపై మండల సమైక్య సభ్యులతో చర్చించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి విద్యార్థుల యూనిఫామ్స్ స్టిచ్చింగ్, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు సిద్దాబాయి, ఏపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సభ్యురాలు చదువుకోవాలి

బీర్కూర్: ప్రతీ సభ్యురాలు చదువుకోవాలని, ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీఓ ఏపిడి మురళీ కృష్ణ మహిళలకు సూచించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్డీఓ ఏపీడీ మురళీ కృష్ణ హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌లను సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, ధాన్యం కొనుగోళ్ళు తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, ఏపీఎం గంగాధర్, సీసీలు నాగలక్ష్మి, పండరి, మహేందర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి టౌన్, మే26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ సెలక్షన్‌లో పలువురు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లాఅథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అనిల్ తెలిపారు. ఎంపికైన వారిలో శ్రీహన్, శ్రీయాస్, సాయి సిద్దార్థ్, శ్రద్ధ, సాయిశ్రేష్ఠ, కార్తికేయా, సుశాంక్, కార్తికేయా, మంజూల, నిరిగ్నాశరణ్య, స్నితిక, సిద్ధుచైతన్య, వరుణ్, విహాన్‌రెడ్డి, నిర్విల్, భార్గవ్‌రెడ్డి, సాత్విక, పోచవ్వ, స్నేహిత, గీతమ్, రితిక, సాయిప్రియలు ఉన్నారు. వీరు జూన్ 1న హైదరాబాద్‌లోని జిమ్ ఖానాగ్రౌండ్స్‌లో నిర్వహించే అండర్ -8,10,12 విభాగాల అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు.

ఇసుక వాహనం పట్టివేత

మద్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న బొలెరియో వాహనాన్ని డోంగ్లి మండలం లింబూర్ వద్ద పట్టుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు. సోమవారం సిర్పూర్ గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న బులేరా వాహనం లింబూర్ వద్ద పట్టుకొని మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమన్నారు.

వాటర్ ట్యాంకు శుభ్రం చేస్తూ

విద్యుత్ షాక్‌కు గురై అటెండర్ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు ● భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన

భిక్కనూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తూ పైన ఉన్న విద్యుత్ వైర్లకు నిచ్చెన తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల పాఠశాల సిబ్బంది లింగం (35), ఆరోజ్‌కుమార్, భాస్కర్ ముగ్గురూ కలిసి గురుకుల పాఠశాలలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో లింగం, ఆరోజ్‌కుమార్ ట్యాంకుపైకి వెళ్లగా భాస్కర్ కింది నుంచి ఇనుప నిచ్చెనను అందించాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు నిచ్చెన ట్యాంకు పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో నిచ్చెన పట్టుకున్న లింగం విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న ఆరోజ్‌కు తీవ్రగాయాలయాయి. దీంతో వెంటనే పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఆంజనేయులు, ఆర్డీవో వీణ, విద్యుత్ ఏఈ సంకీర్త్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనలో గాయపడిన ఆరోజ్‌కుమార్‌ను వెంటనే జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



ఘటనాస్థలంలో లింగం మృతదేహం



లింగం (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, విద్యుత్ అధికారుల

కూలిన పాఠశాల ప్రహరీని నిర్మించాలని గ్రామస్థుల నిరసన

నాగిరెడ్డిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయిందని, ప్రహరీని వెంటనే పునర్‌నిర్మించాలని సోమవారం పోచారం గ్రామస్థులు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా పోచారం గ్రామంలో రోడ్డు నిర్మాణం పనులు జరు గుతున్న నేపథ్యంలో రోడ్డు పక్కనే ఉన్న పాఠశాల ప్రహరీ ఇటీవల వారంరోజులుగా కురుస్తున్న వర్షా ల కారణంగా నూతనంగా నిర్మించిన డ్రైనేజీ ద్వారా వరద నీటి ప్రవాహానికి గురై పాఠశాల ప్రహరీ కొం తభాగం కూలిపోయిందని స్థానికులు తెలిపారు. గ్రామస్థుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై మల్లారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. జాతీయ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్న నిర్వాహకులతో మాట్లాడారు. తగు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎస్సై గ్రామస్థులకు నచ్చజెప్పడంతో గ్రామస్థులు నిరసనను విరమించారు. అనంతరం గ్రామస్థులు స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై మల్లారెడ్డి

గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయాలు

(3వ పేజీ తరువాయి)

అందజేశారు. గ్రామాల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తుండడంతో గ్రామాల్లోని యువత మద్యానికి బానిసవుతుందని, తమ విలువైన జీవితాన్ని వారు నాశనం చేసుకుంటున్నారని, 15 ఏళ్ల లోపు పిల్లల సైతం మద్యానికి అలవాటు పడుతున్నారని, గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయంతో గొడవలు జరిగే అవకాశం ఉందని, గ్రామంలో నిర్వహిస్తున్న అక్రమ మద్యం బెల్ట్ షాపులను వెంటనే మూయించాలని కోరుతూ ఇటీవల మాల్తుమ్మెద, నాగిరెడ్డిపేట గ్రామస్థులు, యువకులు గ్రామపంచాయతీ కార్యదర్శులు అశోక్, కార్తీక్‌లకు వినతి పత్రాలు అందజేశారు. దీంతో బెల్ట్ షాపుల దుకాణదారులు మద్యాన్ని విక్రయించొద్దని పంచాయతీ కార్యదర్శులు వారికి నోటీసులను జారీ చేశారు.

● బెల్టు షాపులపై చర్యలు చేపట్టని ఎక్సైజ్ అధికారులు

మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమ మద్యం బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఈ బెల్టు షాపుల పైన ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామీణ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి అధికారులు ప్రతీ నెల మాముళ్లు తీసుకుంటూ ఈ బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో రెండు నుంచి ఐదు వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తుంది. కిరాణా షాపుల యజమానులు తమ షాపులో మద్యాన్ని పెట్టి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమ మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న పోలీసు అధికారులు సైతం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామీణ ప్రజల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు తన చర్యలు తీసుకుని గ్రామాల్లోని బెల్ట్‌షాపులపైన తగు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మద్నూర్‌లో తిరంగా ర్యాలీ

మద్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి బదులుగా భారత ఆర్మీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంపై బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మద్నూర్ మండలకేంద్రంలో వేయి అడుగుల తిరంగా జెండాతో భారీర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం నుంచి గాంధీచౌక్ పాత బస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో బీజేపీ శ్రేణులు, మండల ప్రజలు, మాజీ సైనికులు, పోలీసు అధికారులు వేలాదిగా పాల్గొన్నారు. ర్యాలీలో వందేమాతరం, జైజవాన్, జైకిసాన్, భారత్ మాతాకీజై అనే నినాదాలు మారుమోగాయి. ర్యాలీలో ముఖ్యఅతిథిగా జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి గుర్తుకు వస్తే రక్తం మరిగిపోతుందన్నారు. మన అమ్మ, అక్కా, చెల్లెల సిందురాన్ని తుడిచేసిన ఉగ్రవాదులకు మన సైనికులు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, జుక్కల్ మాజీ శాసన సభ్యురాలు కుమారి అరుణతార, జుక్కల్ మాజీ శాసన సభ్యులు గంగారాం, మద్నూర్, డోంగ్లి మండలాల బీజేపీ అధ్యక్షుడు తుకారాం, జిల్లా బీజేవైఎం నాయకులు కృష్ణ పటేల్, కార్యకర్తలు ఉన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం 3వేల యూనిట్ల రక్త సేకరణ: ఐవీఎఫ్

కామారెడ్డిటౌన్, మే26 (ఆంధ్రజ్యోతి): తలసేమియా చిన్నారుల కోసం దేశంలోనే అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించిన రికార్డు కామారెడ్డి జిల్లాకే దక్కిందని ఐవీఎఫ్ సేవదళ్ రాష్ట్ర చైర్మన్‌బాలు తెలిపారు. సోమవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలో రక్తదానశిబిరం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలలో అత్యధికంగా 3వేల యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 250 మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారికి జీవితాంతం 15 రోజులకు ఒకసారి యూనిట్ రక్తం అవసరం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ జైపాల్‌రెడ్డి, రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్‌షైమద్, ప్రధాన కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జుక్కల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండెల్లారు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ సోమవారం తెలిపారు. అలాగే వారి బైక్‌లు, 1600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలి

బాన్సువాడటౌన్, మే26 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అయ్యాల సంతోష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందజేయబడుతున్న పథకాలను ఈ కమిటీ పర్యవేక్షించుటకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో హన్మంత్, ప్రశాంత్, సురేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మాచారెడ్డి, మే26 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ ఎక్సెల్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మాచారెడ్డి మండలం చిన్నలచ్చాపేట గ్రామస్టేజీ వద్ద సోమవారం చోటుచేసుకుంది. చిన్నలచ్చాపేట గ్రామానికి చెందిన బూస నారాయణ, తన కూతురు చుక్కి సులోచన (36), మనమళ్లు అన్వేష్, మహేష్‌తో కలిసి ఎక్సెల్ వాహనంపై మాచారెడ్డి నుంచి లచ్చాపేటకు వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న ఆకాష్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సులోచన మృతిచెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. నారాయణ, అన్వేష్, మహేష్ చికిత్స పొందుతున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: పలువురికి గాయాలు

దోమకొండ, మే26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా రోడ్డుపై సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాయాలైన వారిని స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - వర్షం
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - సింగిల్
వెంకటేశ్వర - నిశ్శబ్ద ప్రేమ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

